సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 21 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6.50, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



నేడు ట్యాబ్‌ల పంపిణీ

వైఎస్ జగన్ సర్కార్ వరుసగా రెండో ఏడాది ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. గురువారం జిల్లాలోని 16 వేల మంది విద్యార్థులకు పంపిణీ చేయనుంది. 8లో



జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సబ్ కలెక్టర్ అపూర్వ భరత్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్

పెనుకొండ/పుట్టపర్తి అర్బన్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పెనుకొండ నూతన సబ్ కలెక్టర్ అపూర్వభరత్ పేర్కొన్నారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. బాధ్యతలు స్వీకరించిన సబ్ కలెక్టర్‌ను కార్యాలయ సిబ్బంది అభినందించారు. అనంతరం పుట్టపర్తికి చేరుకుని కలెక్టర్ అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పెనుకొండ సబ్ డివిజన్ పరిస్థితిని కలెక్టర్ వివరించి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

యువకుడి ఆత్మహత్య



సందీప్ (ఫైల్)

హిందూపురం అర్బన్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం గలిబిపల్లి నివాసి సి.సందీప్(26) మెకానిక్ అసిస్టెంట్‌గా జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితం వివాహమైంది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో భార్య విడాకులు ఇచ్చి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన సందీప్ అప్పట్లో రెండు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. రెండు రోజుల క్రితం క్రిమి సంహారక మందు తాగడంతో కుటుంబసభ్యులు గమనించి వెంటనే హిందూపురంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కాస్త కోలుకున్న సందీప్ బుధవారం మధ్యాహ్నం నేరుగా ఎంజీఎం సూర్కిల్ వద్ద ఉన్న పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పెట్రోలు బంకులో చోరీ



దుండగుల చేతిలో గాయపడ్డ రాజశేఖర్

రాప్తాడు: మండలంలోని రామినేపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంక్ (చెన్నకేశవ ఫిల్లింగ్ స్టేషన్)లో దుండగులు చొరబడి నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు.. మంగళవారం రాత్రి పెట్రోల్ బంక్‌లో అనంతపురానికి చెందిన పవన్‌కుమార్, ప్రసాద్, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నివాసి రాజశేఖర్ విధుల్లో ఉన్నారు. బుధవారం వేకువజాము 2 గంటలకు పవన్‌కుమార్, రాజశేఖర్ నిద్రిస్తుండగా ప్రసాద్ మేల్కొని ఉన్నాడు. ఆ సమయంలో ముగ్గురు వ్యక్తులు మాస్క్‌లు ధరించి చేతుల్లో కట్టెలు పట్టుకుని పెట్రోల్ బంక్‌లోకి చొరబడ్డారు. ఆ సమయంలో వారి చొరబాటును ప్రసాద్ అడ్డుకోగా గొడవ చోటు చేసుకుంది. దీంతో పవన్‌కుమార్, రాజశేఖర్ నిద్రలేచి ఆగంతకులను నిలువరించే ప్రయత్నం చేయడంతో అప్పటికే తమ వద్ద సిద్ధంగా ఉంచుకున్న కారం తీసి ముగ్గురి కళ్లలోకి చల్లారు. అనంతరం రూ.28 వేలు అపహరించుకుని వెళుతుండగా పవన్‌కుమార్, రాజశేఖర్, ప్రసాద్ ఎదురు దాడికి దిగారు. దీంతో కట్టెలతో విచ్చలవిడిగా దాడి చేసి దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. ఘటనలో రాజశేఖర్ తలకు తీవ్ర రక్తగాయమైంది. విషయం తెలుసుకున్న సీఐ నరేంద్రరెడ్డి, సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఘటనపై పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

సోమందేపల్లి: స్థానిక ఓ కాలనీకు చెందిన బాలికను ఈ నెల 11న అపహరించిన కేసులో బుక్కపట్నం గ్రామానికి చెందిన యువకుడు గణేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సోమందేపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పేదలకూ విదేశీ విద్యాయోగం

- జగన్ చొరవతో నిరుపేదల కల సాకారం
- ప్రపంచంలోని అత్యుత్తమ యూనివర్సిటీల్లో చదువులు
- ఫీజుతో పాటు వసతి ఖర్చులు సైతం చెల్లిస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో నలుగురు విద్యార్థులకు లబ్ధి
- తాజాగా ముగ్గురికి జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: నిరుపేద విద్యార్థుల కలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఏ ఒక్క విద్యార్థీ ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో వివిధ పథకాలు అమలు చేస్తూ విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్నారు. అంతేకాకుండా ప్రపంచంలోని అత్యుత్తమ యూనివర్సిటీల్లో సీటు తెచ్చుకుంటే చాలు ఫీజుతో పాటు వసతి ఖర్చులు చివరకు విమాన చార్జీలు సైతం చెల్లిస్తున్న జగన్ సర్కార్ పేద కుటుంబాల్లోని విద్యార్థులకు విదేశీ విద్యాయోగాన్ని కల్పిస్తోంది. ఈ పథకం కింద జిల్లాలోని నలుగురు విద్యార్థులకు లబ్ధి కలుగుతోంది. తాజాగా యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన విద్యార్థులకూ ఆర్థికంగా దన్నుగా నిలిచింది. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద జిల్లాలోని ముగ్గురికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేసింది. బుధవారం తాడేపల్లిలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డ్ చైర్మన్ అవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు శివరంగ ప్రసాద్, మోహన్‌రాం, నిర్మలాజ్యోతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారుల కుటుంబీకులకు మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల్లోని విద్యార్థులను ఆదుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గతంలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని ఏర్పాటు చేశారని, నేడు జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాన్ని సైతం అమలు చేస్తూ విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేశారన్నారు. ఇందులో యూనివర్సిటీ ఫీజులతో పాటు హాస్టల్ వసతి, విమాన టికెట్లు, వీసా ఖర్చులను సైతం ప్రభుత్వమే భరిస్తోందన్నారు.

నలుగురికి విదేశీ విద్యాదీవెన సాయం..

'జగనన్న విదేశీ విద్య'కు ఈ విడత నలుగురు అర్హత సాధించారు. అందులో హిందూపురానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు విష్ణుసాయి రాయల్‌కు రూ.15,64,369, హిందూపురం డీబీ కాలనీకి చెందిన సుంకు రామనాథ్ కుమారుడు సాహిత్‌కు రూ.15,15,252 (మొదటి విడత), కొత్తచెరువుకు చెందిన శివారెడ్డి కుమారుడు రాజశేఖరరెడ్డికి రూ.12,78,400, ఓడీసీ మండలం అల్లాపల్లికి చెందిన గంగులప్ప కుమార్తె అనితకు రూ.51,184 చొప్పున చెక్కు అందజేశారు.

ముగ్గురికి జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం..

యూపీపీఎస్సీ ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు 'జగనన్న సివిల్ సర్వీసెస్' ప్రోత్సాహకానికి ఎంపికయ్యారు. వారిలో తనకల్లు మండలం బాలసముద్రం గ్రామానికి చెందిన కార్తీక్, కదిరి మండలం చలమకుంటపల్లి గ్రామానికి చెందిన గిరిప్రసాద్‌రెడ్డి, గోరంట్ల మండలం బూదిలి గ్రామానికి చెందిన రాజేష్ నాయక్ ఉన్నారు. వీరందరికీ రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకాన్ని అందజేశారు.

వైఎస్ జగన్ సహకారంతోనే..



నేను గుమస్తాగా పనిచేస్తా. నా కుమారుడు సాహిత్ ప్రస్తుతం అమెరికాలో చదువుకుంటున్నాడు. తోటి స్నేహితులు గుమస్తా కొడుకు అమెరికాలో చదువుతున్నాడంటుంటే నాకు చాలా సంతోషంగా ఉంది. ఇదంతా సీఎం వైఎస్ జగన్ సహకారంతోనే సాధ్యమైంది. అమెరికాలో చదవాలనే నా కుమారుడి కలను నిజం చేశారు. సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– రామనాథ్, హిందూపురం

బటన్ నొక్కగానే ఖాతాలో జమ



'విదేశీ విద్యా దీవెన' పథకానికి మా కుమారుడు రాజశేఖరరెడ్డి ఎంపికయ్యాడు. ఇప్పటికే రెండు విడతల సొమ్ము అందించారు. ఇప్పుడు తాజాగా సీఎం జగన్ బటన్ నొక్కగానే ఖాతాలో సొమ్ము జమ అయ్యింది. ఇప్పటి వరకూ రూ.38 లక్షల దాకా ఆర్థిక సాయం చేశారు. సీఎం రుణం తీర్చుకోలేనిది. చాలా సంతోషంగా ఉంది.

– శివారెడ్డి, పద్మావతి దంపతులు, కొత్తచెరువు

స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు భవనాల పరిశీలన



కౌంటింగ్ కేంద్రానికి అనువైన భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

గోరంట్ల: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ పరిశీలనకు గోరంట్ల లోని న్యూ మాంటిస్సోరీ ఇంగ్లిష్ మీడియం, బాలుర ఉన్నత పాఠశాల, ఆడిటోరియం, షాదీమహల్, బీసీ హాస్టల్‌లోని గదులను కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట డీఆర్వో కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ రంగనాయకులు ఉన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ లీగ్ విజేత 'లేపాక్షి'



విజేత ట్రోఫీతో లేపాక్షి జట్టు క్రీడాకారులు

లేపాక్షి: అనంతపురంలోని అనంత క్రీడాగ్రామం వేదికగా సాగిన జిల్లా బాలికల అండర్–15 ఫుట్‌బాల్ పోటీల్లో లేపాక్షి ఫుట్‌బాల్ క్లబ్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మేరకు పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్ రామాంజినేయులు బుధవారం తెలిపారు.

26 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

పుట్టపర్తి అర్బన్: క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు ఈనెల 26 నుంచి ప్రారంభమవుతాయని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీ అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా క్రీడా ప్రాధికార అధికారి ఉదయ్‌భాస్కర్, జిల్లా గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తదితరులతో క్రీడల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..పోటీల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలోని 1,50,836 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నారని, పోటీల నిర్వహణకు 502 మైదానాలను గుర్తించామన్నారు. ప్రతి క్రీడాకారునికీ నాణ్యమైన కిట్ ఇస్తామన్నారు. నియోజక వర్గం స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేకాధికారులు అవసరమైన పనులన్నీ పూర్తి చేయాలన్నారు.

జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాలు

- కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా 184 మంది సెక్టార్ ఆఫీసర్లను నియమించి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ కనీస సదుపాయాల కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘించినా, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా, భయపెట్టినా ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇప్పటి వరకూ అందిన దరఖాస్తుల్లో ఫారం-6 సంబంధించి 145, ఫారం-7కు సంబంధించి 1,369, ఫారం-8కు సంబంధించి 137 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాకు లక్ష ఎపిక్ కార్డులు రానున్నాయని, క్లెయిమ్‌లన్నీ పరిష్కరించాక జనవరి 5న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రమేష్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, ఎన్నికల అధికారి మైనుద్దీన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంతృప్తితో వెళ్తున్నా

ఆత్మీయ వీడ్కోలు సభలో జేసీ చేతన్



జేసీ చేతన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో సబ్‌కలెక్టర్లు కార్తీక్, అపూర్వ భరత్

పుట్టపర్తి అర్బన్: 'జిల్లాలో పనిచేసిన 20 నెలలూ అన్ని శాఖల సమన్వయంతో మంచి ఫలితాలు సాధించాం. ఆ సంతృప్తితో వెళ్తున్నా. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అని జాయింట్ కలెక్టర్ చేతన్ అన్నారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వం చేతన్‌తో పాటు పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో జేసీ చేతన్, పదోన్నతి పొందిన సబ్ కలెక్టర్ కార్తీక్, పెనుకొండ నూతన సబ్ కలెక్టర్ భరత్‌ను అధికార యంత్రాంగం ఘనంగా సత్కరించింది. జేసీ చేతన్ మాట్లాడుతూ... జిల్లాలో రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.1000 కోట్లు ఖర్చు చేశామన్నారు. జాతీయ రోడ్ల విస్తరణ వల్ల కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం ధర్మవరం నియోజక వర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఈ జిల్లాకే కలెక్టర్‌గా రావాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు ఆర్డీఓలు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు జేసీ చేతన్‌ను ఘనంగా సత్కరించారు.

పెళ్లి కాలేదంటూ వ్యక్తి ఆత్మహత్య

మడకశిర: పెళ్లి కాకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని చీపులేటి గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి (32)కి పెళ్లి చేసేందుకు కుటుంబసభ్యులు సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలో అన్నకు, తమ్ముడికి పెళ్లిళ్లు అయ్యాయి. కానీ రమేష్‌రెడ్డికి ఎలాంటి సంబంధమూ కుదరలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆయన బుధవారం తన ఇంటి సమీపంలోని ఓ షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

నేడు విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

- గత ఏడాది కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్నవి కొనుగోలు చేసిన సర్కార్
- జిల్లాలో 16 వేల మంది విద్యార్థులకు లబ్ధి

పుట్టపర్తి: అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటీ పడేలా జగన్ సర్కార్ నూతన అధ్యాయానికి తెరలేపింది. వరుసగా రెండో ఏడాది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో జిల్లాలోని 16 వేల మంది విద్యార్థులు గురువారం నూతన ట్యాబ్‌లను అందుకోనున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ సామర్థ్యమున్న ట్యాబ్‌లను విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. ఒక్కో ట్యాబ్ విలువ రూ.26వేలకు పైగా చేస్తుందని నిపుణులు అంటున్నారు. బైజూస్ కంటెంట్‌తో పాటు డిజిటల్ పాఠ్యాంశాలు, 9, 10వ తరగతులకు సంబంధించి బైజూస్ కంటెంట్, ఈ-కంటెంట్‌ను నిక్షిప్తం చేశారు.

హోదా మరచి పనిచేయాలి : డీఐజీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

పెనుకొండ రూరల్: హోదాలను మరచి సమష్టిగా పనిచేయాలని పోలీసు సిబ్బందికి డీఐజీ అమ్మిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి కియా పోలీసుస్టేషన్‌ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలు సృష్టించే వారిని గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాలు, దిశ యాప్ వినియోగంపై ప్రజలను చైతన్య పరచాలని మహిళా పోలీసులకు సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ శాంతిభద్రతల అంశంపై ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తుండాలన్నారు. సాయంత్రం వేళల్లో విజువల్ పోలీసింగ్ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పీ మాధవరెడ్డి, డీఎస్పీ హుస్సేన్ పీరా, సీఐ రాజారమేష్, ఎస్‌ఐ రమేష్‌బాబు, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఇతరులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రేమ, శాంతిని బోధించిన క్రీస్తు మార్గంలో అందరూ నడవాలన్నారు. అనంతరం పలువురు క్రైస్తవులు క్రీస్తును స్తుతిస్తూ పాటలు పాడారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కొవ్వొత్తులు వెలిగించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్లను సత్కరించారు. డీఆర్‌ఓ కొండయ్య, అడిషనల్ ఎస్పీ విష్ణు, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డ్ చైర్మన్ అవుటాల రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.